08-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇక్కడ ధారణ చేసి ఇతరుల చేత కూడా తప్పకుండా చేయించాలి, పాస్ అయ్యేందుకు మాత-పితల సమానంగా అవ్వాలి, ఏదైతే వింటారో దానిని వినిపించాలి కూడా"

ప్రశ్న:- పిల్లలలో ఏ శుభకామన ఉత్పన్నమవ్వడం కూడా మంచి పురుషార్థానికి గుర్తు?

జవాబు:- ఒకవేళ పిల్లలలో - మేము మాత-పితలను ఫాలో చేసి సింహాసనంపై కూర్చుంటాము అన్న శుభకామన ఉన్నట్లయితే ఇది కూడా ఎంతో మంచి ధైర్యము. ఎవరైతే - బాబా, మేమైతే పూర్తి పరీక్షను పాసవుతాము అని అంటారో, అది కూడా శుభం పలకడమే. దీని కొరకు పురుషార్థము కూడా అంత తీవ్రముగా చేయాలి.

పాట:- మా తీర్థాలు అతీతమైనవి... (హమారే తీర్థ్ న్యారే హై...)

ఓం శాంతి. ఇప్పుడు ఇక్కడ అందరూ పాపాత్ములే, పుణ్యాత్ములు స్వర్గములోనే ఉంటారు. ఇది పాపాత్ముల ప్రపంచము, ఇక్కడ అజామిళుల వంటి పాపాత్ములు ఉన్నారు మరియు అది స్వర్గపు దేవతలు ఉండే పుణ్యాత్ముల ప్రపంచము. ఇరువురి మహిమ వేర్వేరు. బ్రాహ్మణులైన ప్రతి ఒక్కరూ, తమ ఈ జన్మ యొక్క జీవిత కథను - మేము ఇన్ని పాపాలు చేశాము అని వ్రాసి బాబాకు వద్దకు పంపిస్తారు. బాబా వద్ద అందరి జీవిత కథలూ ఉన్నాయి. పిల్లలకు తెలుసు - ఇక్కడ వినాలి మరియు వినిపించాలి. కావున వినిపించేవారు ఎంత ఎక్కువ మంది కావాలి. ఎప్పటివరకైతే వినిపించేవారిగా అవ్వరో అప్పటివరకూ పాసవ్వలేరు. ఇతర సత్సంగాలలో ఈ విధంగా విని మళ్ళీ వినిపించాలి అని బంధింపబడి లేరు. ఇక్కడ ధారణ చేసి, మళ్ళీ చేయించాలి, అనుచరులను తయారుచేయాలి. ఇక్కడ ఒకే పండితుడు కథను వినిపిస్తారని కాదు, ఇక్కడ ప్రతి ఒక్కరూ మాతా-పితల సమానంగా అవ్వాలి. ఎప్పుడైతే ఇతరులకు వినిపిస్తారో, అప్పుడే పాస్ అవుతారు మరియు తండ్రి హృదయం పైకి ఎక్కుతారు. జ్ఞానము గురించే అర్థం చేయించడం జరుగుతుంది. అక్కడైతే అందరూ శ్రీకృష్ణ భగవానువాచ అని అంటారు, ఇక్కడ జ్ఞానసాగరుడు, పతిత-పావనుడు, గీతా జ్ఞానదాత అయిన శివ భగవానువాచ అని అంటారు. రాధా-కృష్ణులను మరియు లక్ష్మీ-నారాయణులను భగవాన్-భగవతీ అని అనరు, నియమం అలా లేదు. కానీ భగవంతుడే వారికి పదవిని ఇచ్చారు, కావున తప్పకుండా భగవాన్-భగవతీలుగానే తయారుచేస్తారు, అందుకే ఆ పేరు వచ్చింది. మీరు ఇప్పుడు విజయమాలలో స్మరింపబడేందుకు పురుషార్థం చేస్తున్నారు. మాల అయితే తయారవుతుంది కదా. పైన రుద్రుడు ఉన్నారు, రుద్రాక్ష మాల ఉంటుంది కదా. ఈశ్వరుని మాల ఇక్కడ తయారవుతూ ఉంది. మా తీర్థాలు అతీతమైనవి అని అంటారు. వారైతే తీర్థ యాత్రలలో ఎన్నో ఎదురుదెబ్బలు తింటారు. మీ విషయము అతీతమైనది. మీ బుద్ధి యోగము శివబాబాతో ఉంది. రుద్రుని కంఠహారంగా అవ్వాలి. మాల యొక్క రహస్యము కూడా తెలియదు. పైన పుష్పమైన శివబాబా ఉన్నారు, ఆ తర్వాత జగదాంబ, జగత్పిత మరియు వారి 108 వంశావళి ఉన్నారు. బాబా చూసారు - చాలా పెద్ద మాల ఉంటుంది, దానిని అందరూ రామ-రామ అంటూ లాగుతూ ఉంటారు, లక్ష్యమేమీ ఉండదు. రుద్రమాలను తిప్పుతారు, రామ-రామ అని అంటూ జపం చేస్తూ ఉంటారు. ఇదంతా భక్తి మార్గము. ఎంతైనా ఇది ఇతర విషయాలకన్నా మంచిదే ఎందుకంటే ఆ విధంగా చేస్తున్నంత సమయమైతే ఏ పాపాలు జరగవు. పాపాల నుండి రక్షించుకునేందుకు ఇవి యుక్తులు. ఇక్కడ మాలను తిప్పే విషయమేమీ లేదు. స్వయం మాలలోని మణులుగా అవ్వాలి. మన తీర్థాలు అతీతమైనవి. మనం మన శివబాబా ఇంటికి అవ్యభిచారీ యాత్రికులము. యోగము ద్వారా మన జన్మ-జన్మాంతరాల వికర్మలు భస్మమవుతాయి. శ్రీకృష్ణుడిని కొందరు రాత్రి-పగలు తలచుకుంటారు కానీ వికర్మలు ఎప్పటికీ వినాశనమవ్వవు. రామ-రామ అని అన్నప్పుడు ఆ సమయంలో పాపాలు జరగవు, కానీ తర్వాత పాపాలు చేయడం మొదలుపెడతారు. అయితే పాపాలేమీ కట్ అవ్వవు, ఆయుష్షు ఏమీ పెరగదు. ఇక్కడ యోగబలము ద్వారా పిల్లలైన మీ పాపాలు భస్మమవుతాయి మరియు ఆయుష్షు పెరుగుతుంది. జన్మ-జన్మాంతరాల కొరకు ఆయుష్షు అవినాశీ అవుతుంది.

మనుష్యుల నుండి దేవతలుగా అవ్వడము - దీనినే జీవితాన్ని తయారుచేసుకోవడమని అంటారు. దేవతలకు ఎంతటి మహిమ ఉంది. తమను తాము నీచులుగా, పాపులుగా పిలుచుకుంటారు... తప్పకుండా అందరూ అలాగే ఉండి ఉంటారు. నిర్గుణుడినైన నాలో ఏ గుణాలూ లేవు, మీరే దయ చూపించండి... అని పాడుతారు. ఈ విధంగా పరమాత్ముని మహిమను చేస్తారు. వారు మిమ్మల్ని సర్వగుణ సంపన్నులుగా, శ్రీకృష్ణుని సమానంగా చేస్తారు, మీరు ఇప్పుడు ఇలా తయారవుతున్నారు. దీని కన్నా ఉన్నతమైన గుణము ఇంకేదీ లేదు. నిర్గుణ బాలక సంస్థ కూడా ఒకటి

ఉంది. నిర్గుణులు అని ఎవరిని అంటారు అనేది అర్థం చేసుకోరు. శ్రీకృష్ణుడు మరియు లక్ష్మీ-నారాయణుల గుణాల వలనే వారిని సర్వగుణ సంపన్నులు... అని మహిమ చేస్తారని పిల్లలైన మీకు తెలుసు, ఇప్పుడు మళ్ళీ మీరు ఆ విధంగా తయారవుతున్నారు. ఈ విధంగా చెప్పే సత్సంగము ఇంకేదీ ఉండదు. ఇక్కడ తండ్రి అడుగుతారు - మీరు లక్ష్మీ-నారాయణులను వరిస్తారా లేక సీతా-రాములను వరిస్తారా? పిల్లలు కూడా అవివేకులైతే కారు. వెంటనే అంటారు - బాబా, మేమైతే పూర్తి పరీక్షను పాసవుతాము. శుభము పలుకుతారు. కానీ అందరూ ఒకే విధంగా అవ్వగలరని కాదు. అయినా కూడా ధైర్యాన్ని చూపిస్తారు. మమ్మా-బాబాలు శివబాబా అతి ప్రియమైన పిల్లలు. మేము వారిని పూర్తిగా ఫాలో చేసి సింహాసనంపై కూర్చుంటాము - ఈ శుభకామన మంచిది. మరి అంతటి పురుషార్థం చేయాలి. ఈ సమయములో చేసే పురుషార్థం కల్ప-కల్పపు పురుషార్థముగా అవుతుంది, గ్యారంటీ ఏర్పడుతుంది. ఇప్పటి పురుషార్థం ద్వారా - కల్పక్రితము కూడా ఇలానే చేసారు అన్నది తెలుస్తుంది. ఇక కల్ప-కల్పము ఇటువంటి పురుషార్థమే కొనసాగుతుంది. పరీక్షల సమయంలో తాము ఎంతవరకు పాసవుతారు అన్నది తెలిసిపోతుంది. టీచరుకైతే వెంటనే తెలిసిపోతుంది. ఇది నరుని నుండి నారాయణునిగా అయ్యే గీతా పాఠశాల. ఇతర గీతా పాఠశాలల్లో - మేము నరుని నుండి నారాయణునిగా అయ్యేందుకు వచ్చాము అని ఎప్పుడూ అనరు. అలాగే అక్కడ టీచర్ కూడా - నేను నరుని నుండి నారాయణునిగా తయారుచేస్తాను అని అనరు. మొదటైతే టీచరుకు నషా ఉండాలి - నేను కూడా నరుని నుండి నారాయణునిగా అవుతాను అని. గీతా ప్రవచనాలు చేసేవారైతే ఎందరో ఉంటారు, కానీ ఎక్కడా కూడా మేము శివబాబా ద్వారా చదువుకుంటున్నాము అని అనరు. వారు మనుష్యుల ద్వారా చదువుకుంటారు. ఉన్నతోన్నతమైనవారు పరమపిత శివ పరమాత్మ అని, వారే స్వర్గ రచయిత, నాలెడ్జ్ ఫుల్ అని, వారే వచ్చి పతితులను పావనంగా తయారుచేస్తారు అని మీకు తెలుసు. సాహెబును జపించినట్లయితే సుఖము లభిస్తుంది అని - గురునానక్ కూడా వారి మహిమనే గానం చేసారు. ఉన్నతోన్నతమైన, సత్యమైన సాహెబ్ వారేనని ఇప్పుడు మీకు తెలుసు. వారు స్వయం అంటారు - తండ్రినైన నన్ను స్మృతి చేయండి. నేను మీకు సత్యమైన అమరకథను, మూడవ నేత్రము యొక్క కథను వినిపిస్తాను. కావున ఇది మూడవ నేత్రము లభించే మరియు నరుని నుండి నారాయణునిగా తయారుచేసే జ్ఞానము. ఓ పార్వతులూ, అమరనాథుడినైన నేను మీకు అమరకథను వినిపిస్తున్నాను. ఉన్నతోన్నతమైనవారు శివబాబా, ఆ తర్వాత బ్రహ్మా-విష్ణు-శంకరులు, ఆ తర్వాత స్వర్గములోని లక్ష్మీ-నారాయణులు, ఆ తర్వాత చంద్రవంశీయులు... ఇలా నంబరువారుగా ఉన్నారు. సమయం కూడా సతో, రజో, తమోగా అవుతుంది. ఈ విషయాల గురించి ఎవ్వరికీ తెలియదు. బాబా ఎన్నో గుహ్యమైన విషయాలను వినిపిస్తున్నారు. ఆత్మలో అవినాశీ పాత్ర ఉంది. ఒక్కొక్క జన్మ యొక్క పాత్ర నిండి ఉంది. అది ఎప్పుడూ వినాశనం అవ్వదు. తండ్రి అంటారు - నా పాత్ర నిండి ఉంది, మీరు సుఖధామములో ఉన్నప్పుడు నేను శాంతిధామములో ఉంటాను. సుఖ-దుఃఖాలు మీ భాగ్యములో ఉన్నాయి. సుఖము మరియు దుఃఖములో ఎన్నెన్ని జన్మలు లభిస్తాయి అనేది కూడా అర్థం చేయించారు. నేను మీ నిష్కామ తండ్రిని, మీ అందరినీ స్వర్గాధిపతులుగా చేస్తాను. ఒకవేళ నేను కూడా పతితముగా అయినట్లయితే మిమ్మల్ని పావనముగా ఎవరు తయారుచేయాలి? అందరి పిలుపును ఎవరు వినాలి? పతిత-పావనుడు అని ఎవరిని అనాలి? ఈ విషయాలను తండ్రి అర్థం చేయిస్తారు, గీతా-పాఠకులు ఎవరూ ఈ విధంగా అర్థం చేయించలేరు, వారు త్రిలోకాల అర్థాన్ని రకరకాలుగా వర్ణిస్తారు. వేద-శాస్త్రాల ద్వారా భగవంతుడిని కలుసుకునే మార్గము లభిస్తుందని మనుష్యులు అంటారు. తండ్రి అంటారు, ఈ శాస్త్రాలన్నీ భక్తి మార్గం కొరకు ఉన్నాయి, జ్ఞాన మార్గం వారి కొరకు శాస్త్రాలు లేవు. జ్ఞానాన్ని వినిపించే జ్ఞానసాగరుడిని నేనే, మిగిలినదంతా భక్తి మార్గపు సామాగ్రి. నేనే వచ్చి ఈ జ్ఞానం ద్వారా సర్వులకు సద్గతిని ఇస్తాను. వారు - నీటి బుడగ నీటి నుండి వెలువడి మళ్ళీ నీటిలో కలిసిపోతుందని భావిస్తారు. కానీ ఆ విధంగా కలిసిపోవడమనేది జరగదు. ఆత్మ అమరమైనది, అది ఎప్పుడూ కాలదు, ఖండించబడదు, తరగదు. తండ్రి ఈ విషయాలన్నింటి గురించి వివరణ ఇస్తారు. మేము యోగబలము ద్వారా విశ్వాధిపతులుగా అవుతున్నాము అని - పిల్లలైన మీకు కాళ్ళ నుండి పిలక వరకు సంతోషం ఉండాలి. ఈ సంతోషం కూడా నంబరువారుగా ఉంది, ఏకరసంగా ఉండదు. పరీక్ష ఒకటే అయినా కానీ పాస్ అవ్వగలగాలి కదా. రాజధాని స్థాపన అవుతూ ఉంది, దాని ప్లాన్ ను తెలియజేస్తారు. సూర్యవంశములో ఇన్ని సింహాసనాలు, చంద్రవంశములో ఇన్ని సింహాసనాలు ఉంటాయి, ఎవరైతే పాసవ్వరో వారు దాస-దాసీలుగా అవుతారు. దాస-దాసీల నుండి మళ్ళీ నంబరువారుగా రాజు-రాణులుగా అవుతారు. చదువుకోనివారు అంతిమములో పదవిని పొందుతారు. బాబా అయితే ఎంతగానో అర్థం చేయిస్తారు, ఒకవేళ ఏదైనా అర్థం కాకపోతే అడగవచ్చు. వివేకం ఏం చెప్తుందంటే - వారు ఎక్కడైతే జన్మ తీసుకుంటారో అక్కడ కూడా తక్కువ సుఖమేమీ ఉండదు, ఎంతో గౌరవముంటుంది, పెద్ద మహళ్ళలో ఉంటారు, పెద్ద-పెద్ద తోటలు ఉంటాయి. అక్కడ రెండు-మూడు అంతస్తులు నిర్మించాల్సిన అవసరముండదు. ఎంతో భూమి ఉంటుంది. ధనానికి లోటు ఉండదు. అక్కడ నిర్మాణము చేయాలనే అభిరుచి ఎంతగానో ఉంటుంది. ఏ విధంగానైతే ఇక్కడ కూడా మనుష్యులకు అభిరుచి ఉంటుంది

కదా. న్యూఢిల్లీని నిర్మించినప్పుడు ఇది కొత్త భారత్ అని భావిస్తారు. వాస్తవానికి కొత్త భారత్ అని స్వర్గాన్ని, పాత భారత్ అని నరకాన్ని అంటారు. అక్కడ ఎవరికి ఎంత కావాలంటే అంత లభిస్తుంది... అంతా డ్రామానుసారంగా జరుగుతుంది. మహళ్ళు మొదలైనవేవైతే కల్పపూర్వము నిర్మించి ఉంటారో, అవే నిర్మించబడతాయి. ఈ జ్ఞానాన్ని ఇతరులెవ్వరూ అర్థం చేసుకోలేరు, ఎవరి భాగ్యములోనైతే ఉంటుందో వారి బుద్ధిలోనే కూర్చుంటుంది. పిల్లలు పురుషార్థం చేయాలి, పూర్తిగా యోగములో ఉండాలి. భక్తి మార్గములో శ్రీకృష్ణుని యోగములోనే ఉంటూ వచ్చారు కానీ స్వర్గాధిపతులుగా అయితే అవ్వలేదు. ఇప్పుడైతే స్వర్గము మీ ఎదురుగా ఉంది. మీకు పరమపిత పరమాత్ముని చరిత్ర, బ్రహ్మ-విష్ణు-శంకరుల చరిత్రను గురించి కూడా తెలుసు. బ్రహ్మ ఎన్ని జన్మలను తీసుకుంటారు అనేది మీకు తెలుసు.

తండ్రి అంటారు - ఈ మాతలు స్వర్గ ద్వారాలను తెరిచేవారు, మిగిలినవారంతా నరకములో పడి ఉన్నారు. మాతలే అందరినీ ఉద్ధరిస్తారు. మనము పరమాత్ముని మహిమను చేస్తాము. మీరు అర్థం చేసుకుని చెప్తారు - శివబాబా, మీకు నమస్తే, మీరు వచ్చి మమ్మల్ని వారసులుగా తయారుచేస్తారు, స్వర్గాధిపతులుగా చేస్తారు, ఇటువంటి శివబాబా, మీకు నమస్తే. తండ్రికి పిల్లలు ఎలాగూ నమస్కరిస్తారు, మళ్ళీ తండ్రి కూడా పిల్లలూ, నమస్తే అని అంటారు. మీరు నన్ను పైసకు విలువ చేయనివాటికి వారసునిగా చేస్తారు, గవ్వలకు వారసునిగా చేస్తారు, నేను మిమ్మల్ని వజ్రాలకు వారసులుగా చేస్తాను. శివ బాలకుడిని వారసునిగా చేసుకుంటారు కదా. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్, నమస్తే, సలామ్ మాలేకమ్. వందే మాతరం.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. శివబాబా ఇంటికి అవ్యభిచారీ యాత్రికులుగా అయి యోగబలముతో వికర్మలను దగ్ధం చేసుకోవాలి. జ్ఞానాన్ని స్మరిస్తూ అపారమైన సంతోషములో ఉండాలి.

2. తండ్రి సమానముగా సింహాసనాధికారులుగా అవ్వాలనే శుభకామనను ఉంచుతూ తండ్రిని పూర్తిగా ఫాలో చేయాలి.

వరదానము:- శీతలాదేవిగా అయ్యి సర్వ కర్మేంద్రియాలను శీతలముగా, శాంతముగా చేసుకునే స్వరాజ్య అధికారీ భవ

స్వరాజ్య అధికారీ పిల్లలు ఎవరైతే ఉన్నారో, వారిని ఏ కర్మేంద్రియము మోసగించలేదు. ఎప్పుడైతే మోసగించే చంచలత సమాప్తమైపోతుందో, అప్పుడు స్వయం శీతలాదేవిగా అవుతారు మరియు అన్ని కర్మేంద్రియాలు కూడా శీతలమవుతాయి. శీతలాదేవికి ఎప్పుడూ క్రోధము రాదు. క్రోధము లేదు కానీ కొంచెము అధికారదర్పమైతే ఉంచాల్సి వస్తుంది అని చాలామంది అంటారు. కానీ అధికారదర్పము కూడా క్రోధము యొక్క అంశమే. మరి ఎక్కడైతే అంశముంటుందో, అక్కడ వంశము ఉత్పన్నమైపోతుంది. మీరు శీతలాదేవీలు మరియు శీతలాదేవులు, అందుకే స్వప్నములో కూడా క్రోధము మరియు అధికారదర్పము యొక్క సంస్కారాలు ఇమర్జ్ అవ్వకూడదు.

స్లోగన్:- ఆజ్ఞాకారీ పిల్లలు స్వతహాగానే ఆశీర్వాదాలకు పాత్రులుగా అవుతారు, వారికి ఆశీర్వాదాలను యాచించాల్సిన అవసరము ఉండదు.

మాతేశ్వరిగారి మధుర మహావాక్యాలు

"నయనహీనునికి అనగా జ్ఞాన నేత్రహీనునికి మార్గాన్ని చూపించేవారు పరమాత్మ"

నయనహీనునికి మార్గాన్ని చూపించండి ప్రభూ... ఇప్పుడు - నయనహీనునికి మార్గాన్ని చూపించండి అని మనుష్యులు ఏ పాటనైతే పాడుతారో, దాని అర్థము ఏమిటంటే - మార్గాన్ని చూపించేవారు ఒక్క పరమాత్మయే, అందుకే పరమాత్మను పిలుస్తారు మరియు ఎప్పుడైతే - ప్రభూ, మార్గాన్ని చూపించండి అని అంటారో, అప్పుడు తప్పకుండా మనుష్యులకు మార్గాన్ని చూపించేందుకు పరమాత్మ స్వయంగా నిరాకార రూపము నుండి సాకార రూపములోకి తప్పకుండా రావలసి ఉంటుంది, అప్పుడే కదా స్థూలంగా మార్గాన్ని చూపించగలరు, వారు రాకుండా మార్గాన్ని అయితే చూపించలేరు. ఇప్పుడు మనుష్యులు ఎవరైతే తికమకపడి ఉన్నారో, ఆ తికమకలో ఉన్నవారికి

మార్గము కావాలి, అందుకే పరమాత్మను - నయనహీనునికి మార్గాన్ని చూపించండి ప్రభూ అని అంటారు. వారినే మళ్ళీ నావికుడు అని కూడా అంటారు, వారు ఆవలి తీరానికి అనగా ఈ 5 తత్వాలతో తయారైన ఈ సృష్టిని దాటించి ఆవలి తీరానికి అనగా 5 తత్వాలకన్నా పైన ఆరవ తత్వమైన అఖండ జ్యోతి మహాతత్వము ఏదైతే ఉందో, అక్కడికి తీసుకువెళ్తారు. కనుక పరమాత్మ కూడా ఆ తీరం నుండి ఈ తీరంలోకి వచ్చినప్పుడే కదా తీసుకువెళ్ళగలుగుతారు. కనుక పరమాత్మ కూడా వారి ధామము నుండి రావాల్సి వస్తుంది, అందుకే పరమాత్మను నావికుడు అని అంటారు. వారే నావలైన మనల్ని (ఆత్మా రూపీ నావలను) ఆవలి తీరానికి తీసుకువెళ్తారు. ఇప్పుడు పరమాత్మతో ఎవరైతే యోగాన్ని జోడిస్తారో, వారిని తమతో పాటు తీసుకువెళ్తారు. ఇక ఎవరైతే మిగిలిపోతారో, వారు ధర్మరాజు శిక్షలను అనుభవించిన ఆ తర్వాత ముక్తులవుతారు. అచ్ఛా - ఓం శాంతి.